క్లుప్తంగా

బీజేపీలో చేరిన గోడం నగేశ్ అనుచరులు



బీజేపీలో చేరుతున్న గోడం నగేశ్ అనుచరులు

బోథ్: ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ వర్గీయులు బుధవారం బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి అర్జున్ ముండా ఆధ్వర్యంలో ఆయన అనుచరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బోథ్ పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఎంపీటీసీ జుగాదిరావ్, రాజేశ్వర్, మహిపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కిషన్, మాజీ సర్పంచులు విజయ్, లింగు, రమేశ్, దివాకర్ రెడ్డి, హన్మంత్, విష్ణు, రామారావ్, బాపూరావ్‌తో పాటు పలువురు బీజేపీలో చేరారు.

108లో ప్రసవం

ఇచ్చోడ: మండంలోని కామగిరి గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ లలితకు బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో మహిళను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా పురుటినొప్పులు ఎక్కువయ్యాయి. సిబ్బంది అంబులెన్స్ రోడ్డు పక్కన ఆపి ప్రసవం చేశారు. తల్లిబిడ్డాలను ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈఎంటీ రాకేశ్, పైలెట్ ఆలీంలను గ్రామస్తులు అభినందించారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌కు చెందిన ఎంపీటీసీ గిత్తె ఆశబాయి భర్త గిత్తె మనోహర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ బుధవారం మిలింద్‌నగర్‌కు సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, కార్యకర్తలు మీర్జా జీలానిబెగ్, కొరెంగా సుంకట్‌రావ్, సత్యనంద్, కేంద్రే శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో శబరిమాత ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీదాసాంజనేయ విగ్రహ పునః ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టిసావర్‌గాం గ్రామంలో బుధవారం శ్రీదాసాంజనేయ విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మేఘరాజ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు హోమం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బెర్రె వెంకట్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నల్ల గణపతి రెడ్డి, పెద్ద కాపు రాజురెడ్డి, బోరంచు రాంరెడ్డి, బొడగం లక్ష్మారెడ్డి, జక్కుల పోతన్న, లొగెలి రాములు, అన్నం చంటి, రత్నాల రాజన్న, జైపాల్, గ్రామస్తుల పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

బోథ్: బోథ్ పట్టణంలో ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్న దివ్యాంగుడు మారుతికి గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో ఆటో యూనియన్ నాయకులు మారుతికి చేయూతనందించారు. రూ.5000ల ఆర్థిక సాయం బుధవారం మారుతికి అందజేశారు. అలాగే నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లుకు పెన్షన్‌తో పాటు, ఆరోగ్య కార్డులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పంటలపై వడగళ్ల వాన

- నేలవాలిన పంటలు
- మూడురోజులుగా వాతావరణంలో మార్పులు
- పంటల దిగుబడులపై ప్రభావం



వడగళ్ల వానతో నేలకొరిగిన పంట

ఆదిలాబాద్‌రూరల్: వానాకాలంలో అంతంత మాత్రంగానే పంటల దిగుబడులు సాధించిన రైతులు ప్రతీ ఏడాది యాసంగిలో రెండో పంట వేసి అప్పుల నుంచి బయట పడేందుకు వివిధ రకాల పంటలను సాగు చేస్తుంటారు. వడగళ్ల వాన కురవడంతో పాటు వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో సాగవుతున్న జొన్న, వేరుశనగ, మొక్కజొన్న పంటలపై అకాల వర్షాల ముప్పు పొంచి ఉంది. అలాగే జొన్న పది రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో గత కొన్ని రోజులుగా వాతావరణం చల్లబడడం, మేఘాలు కమ్ముకోవడం, మంగళవారం కురిసిన వడగండ్ల వానకు కొన్నిచోట్ల పంటలు నేలకు ఒరిగాయి.

అకాల వర్షాలతో ఆందోళన..

మండలంలో మంగళవారం కురిసిన వడగళ్ల వానతో జొన్న పంట నేల వాలింది. ఇలాంటి పరిస్థితుల్లో వడగళ్లు, గాలి బీభత్సం వెంటాడుతుండడంతో పంటలు చేతికి రాకుండాపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత యాసంగి సమయంలో కూడా పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఈఏడాది కూడా అదే పరిస్థితి కనిపించడంతో రైతులకు దిక్కుతోచని స్థితి నెలకొంది.

యాసంగి సాగు ఇలా..

ఈఏడాది యాసంగిలో మండలంలో సుమారు 7,452 ఎకరాలలో పంటలు సాగు చేస్తున్నారు. జొన్న 7,200 ఎకరాలు, వేరుశనగ 120 ఎకరాలు, మొక్కజొన్న 62 ఎకరాలు, గోధుమలు 40 ఎకరాలు, నువ్వులు 30 ఎకరాలలో సాగవుతున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ముందస్తు సాగు చేస్తే చలి వాతావరణంతో పంటల దిగుబడులు తగ్గటం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక సాగు చేస్తే కూలీల కొరత, భూగర్భజలాలు అడుగంటి సాగునీరు అందక ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పడే బాధలు వర్ణనాతీతం. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కొంత మంది రైతులు నవంబర్‌లో ముందస్తు సాగు విధానాన్ని ఎంచుకున్నారు. అలాంటి వారిపై వడగళ్ల వాన ప్రభావం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మరికొన్ని రోజులు ప్రకృతి కరుణిస్తే రైతులు యాసంగి సాగు నుంచి గట్టెక్కె అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

ఆదుకోవాలని వేడుకోలు..

వానాకాలంలో పంటలు దిగబడి రాక యాసంగిలో పంటలు సాగు చేసి కొంత అప్పుల నుంచి ఉపశమనం పొందుదామంటే ప్రకృతి కరణించడం లేదు. దీంతో రైతులు మరింత అప్పులలోకి వెళ్తున్నారు. వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించి ఆదుకోవాలని యాసంగిలో పంటలు నష్టపోయిన రైతన్నలు కోరుతున్నారు.

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీధర్‌స్వామి

బజార్‌హత్నూర్: వడగళ్ల వాన, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఏడీఏ శ్రీధర్‌స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు జాతర్ల గ్రామాల్లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అకాల వర్షాలతో జొన్న, మొక్కజొన్న పంటలు నేలవాలయన్నారు. పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. పంట నష్టంపై ప్రభుత్వానికి పూర్తి నివేదిక ఇస్తామని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



బోనంతో ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలోగల పోచమ్మ దేవాలయ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. ఎన్నికల్లో తనకు అండగా నిలబడిన ప్రతిఒక్కరికీ అండగా ఉంటానన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తే అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని మొక్కులు చెల్లించుకోవడం పట్ల కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బెల్టుషాపులపై పోలీసులు దాడులు చేస్తున్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరాంకాలనీలోని తలకొక్కుల భూమన్న నిర్వహిస్తున్న బెల్టు షాపులో వన్‌టౌన్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. నిల్వ ఉంచిన 9 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశారు. అదే విధంగా కోలిపూరకు చెందిన సుందర్ నిర్వహిస్తున్న బెల్టు షాపును తనిఖీ చేసి రెండు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సైలు ఉదయ్ కుమార్, నారాయణ తెలిపారు. అదే విధంగా టు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బెల్టు షాపులను పోలీసులు తనిఖీలు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ పేర్కొన్నారు. మద్యం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాతల సాయంతో అంగన్‌వాడీ ఆధునీకరణ



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో

ఖానాపూర్: పట్టణంలో 12వ వార్డు పరిధిలో ఉన్న సుభాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి దాతల సాయంతో మరమ్మతులు చేయించారు. సుభాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పని చేసే టీచర్ సరోజ కూతురు మౌనికరెడ్డి, అబ్బాయి సాయిప్రణీత్‌రెడ్డి సమకూర్చిన రూ.50 వేలతో కేంద్రాన్ని ఆధునీకరించారు. ఈసందర్భంగా బుధవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో సరిత ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, రాధ, శ్యామల, శహీనాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడి హక్కులు సాధించుకోవాలి



వద్యాల్‌లో నినాదాలు చేస్తున్న లక్ష్మి

లక్ష్మణచాంద: మహిళలు పోరాడి హక్కులు సాధించుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి లక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వద్యాల్ గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చీకట్లను చీల్చుకుంటూ వెలుతురు కోసం యుద్ధం ప్రకటించిన రోజును అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకొంటారని పేర్కొన్నారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, కనీస సౌకర్యాల కోసం, మీటింగ్ పెట్టుకునే హక్కు కోసం, పురుషులతోపాటు యూనియన్లలో తమకు కూడా భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, ముత్తవ్వ, గంగామణి, ఎస్.లక్ష్మి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో శ్రీహరిరావు

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ కాలగిరి గంగారెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పొన్కల్, అనంతపేట్, పోతారం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రఫీ, బాపయ్య, వికాస్‌రెడ్డి, శ్రీనివాస్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద ఎత్తిపోతల పథకం చైర్మన్ గంగారావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం భైంసాలోని కాంగ్రెస్ కార్యాలయంలో ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, రాంచందర్ రెడ్డి, ఓం ప్రకాశ్ లడ్డా, భోజారాం, తదితరులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లుల యజమానులు జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాంప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: జిన్నింగ్ మిల్లుల యజమానులు జాగ్రత్తలు పాటిస్తే పత్తిలో గులాబీ రంగు, కాయతొలుచు పురుగులను నివారించవచ్చని కేవీకే శాస్త్రవేత్త బి.రాంప్రసాద్ అన్నారు. జిన్నింగ్ మిల్లుల యజమానులకు బుధవారం మార్కెట్‌యార్డులో అవగాహన కల్పించారు. జిన్నింగ్ మిల్లుల ఆవరణలో పురుగుకు సంబంధించిన లార్వాలు, అవశేషాలు ఉంటే వాటి వ్యాప్తి జరిగే అవకాశం ఉందన్నారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి ఈకార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజశేఖర్, ప్రవీణ్, జిన్నింగ్ మిల్లుల యజమానుల సంఘం అధ్యక్షుడు రాజు చింతవార్, మార్కెట్ కార్యదర్శి దేవన్న పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించాలని షీటీం సభ్యులు సుశీల, సత్యమోహన్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతినగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. షీ టీం విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత చదువులపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలను వివరించారు. సోషల్ మీడియాలో ఎక్కువసేపు కాలక్షేపం చేయకుండా బాగా చదవాలని సూచించారు. సోషల్ మీడియాలో ఎక్కువసేపు ఉన్న పిల్లలు చదువుపై ఆసక్తి చూపడం లేదన్నారు. తద్వారా భవిష్యత్‌లో నష్టపోయే అవకాశముందన్నారు. అమ్మాయిలపై అఘాయిత్యాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, అమ్మాయిలను అనుసరించడం, అసభ్యంగా మాట్లాడినట్లు జరిగితే షీ టీం నెంబర్ 87126 59953 సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలి



తహసీల్దార్ సవాయిసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

బేల: మశాల(కె) రెవెన్యూ శివారులో అసైన్డ్ భూమి సర్వే నం. 3/1, 3/2లలో మూడు ఎకరాలు, సర్వే నం 4లో ఐదు ఎకరాలు, సర్వే నం 14లో ఐదు ఎకరాలు మొత్తంగా 16 ఎకరాల అక్రమ పట్టాలను రద్దు చేయాలని జంగుబాయి దేవస్థానం కమిటీ మశాల(కె) గౌరవ అధ్యక్షుడు ఆడ శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సవాయిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మశాల(కె) గ్రామానికి చెందిన మడావి పోతు కుటుంబానికి గతంలో 33 ఎకరాలకు పైబడి సాగుభూమి ఉందన్నారు. అప్పటి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో మరో 16 ఎకరాల అసైన్డ్ భూమిని పట్టాలుగా పొందారని ఆరోపించారు. భూమి లేని నిరుపేద ఆదివాసీలకు ఇవ్వాల్సిన భూమిని బడా భూస్వామికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జిల్లా రెవెన్యూ అధికారులు విచారణ చేసి, అక్రమ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మరప కాశీరాం, చిక్రం మహాదేవ్, చిక్రం సంభు, కుమ్ర హన్మంతు, జంగు, మడావి పైకు, తొడసం గోవింద్‌రావు, ఉయికే ఇస్రు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కైలాస్‌నగర్: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులతో కలిసి కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు, కోడి గుడ్ల బిల్లులు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను త్వరితగతిన చెల్లించేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ నాయకులు రాంబాయి, సత్తెమ్మ, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సబిత

తాంసి: ప్రతిఒకరూ పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారిలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, వైద్యాధికారి శ్రావ్య, అంగన్‌వాడీ టీచర్లు సరితారెడ్డి, గంగమ్మ, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వలన బిడ్డ ఆరోగ్యకరంగా ఎదుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మంజరంతండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్షం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అజాడే జయశ్రీ, ఉపాధ్యాయులు శారద, భాగ్యలక్ష్మి, అనసూయ, పంచాయతీ కార్యదర్శి రాములు, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో శారద అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. రాగులు, సజ్జలు, కొర్రలు, అరికెలు, పరిగెలు, సాములు, చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డేలో భాగంగా బుధవారం మండలంలోని దర్బతండా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, పిల్లలలో రక్తహీనత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ప్రతీరోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఒకపూట సంపూర్ణ భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, ఆర్‌బీఎస్‌కే టీం, గ్రామపెద్దలు, అంగన్‌వాడీ టీచర్లు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

మథురనగర్ కాలనీలో..

మండల కేంద్రంలోని మథురనగర్ కాలనీలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం విలేజ్ హెల్త్ సానిటేషన్ న్యూట్రీషన్ డే (వీహెచ్‌ఎస్‌ఎన్‌డీ) పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఆహారాన్ని గర్భిణులకు, బాలింతలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్రావణి, ఆశ వర్కర్ గీత, అంగన్‌వాడీ హెల్పర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని డీడబ్ల్యూవో సబిత అన్నారు. పోషణ పక్వాడ్‌లో భాగంగా బుధవారం ఇచ్చోడ మండలంలోని గేర్జం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీలు సమయపాలన పాటిస్తూనే గర్భిణులకు, కిషోర బాలికలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ఆరోగ్య కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో బోథ్, ఆదిలాబాద్ సీడీపీవోలు సౌందర్య, మిల్కా, సఖీ సెంటర్ కోఆర్డినేటర్ యశోద, సీహెచ్‌వో బ్రహ్మానందం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తలమడుగు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీఎస్ సూపర్‌వైజర్ విజయ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడుతారన్నారు. అలాగే అంగన్‌వాడీకి వచ్చే పిల్లలకు నిత్యం పౌష్టికారం, పాలు, గుడ్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, భాగ్యమ్మ, ఉమాదేవి, ఆశన్న, విజయ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీమెటీరియల్ అందుకుంటున్న యువత

ఖానాపూర్: పట్టణంలోని గ్రంథాలయంలో చదివే 50 మంది నిరుద్యోగ యువతకు మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు రూ.40 వేల విలువైన గ్రూప్స్, డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. గతంలో ‘సాక్షి’లో అసౌకర్యాల నడుమ చదివేదెలా? అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కృష్ణంరాజు స్పందించారు. గ్రంథాలయంలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణంరాజును శాలువాతో సన్మానించారు.